నమస్తే తెలంగాణ
ములుగు
జయశంకర్ భూపాలపల్లి
5 | వరంగల్, ఆదివారం 26 జనవరి 2025 | MULUGU JAYASHANKAR BHUPALPALLY



గణతంత్ర దినోత్సవం సందర్భంగా విద్యుత్ దీపాల వెలుగులో హనుమకొండ కలెక్టర్ కార్యాలయ సముదాయం

# దేశం మనదే.. తేజం మనదే!

- పంట పొలాల్లో చిన్నారుల జెండా జోష్
- నేడు ఊరూరా గణతంత్ర సంబురం

*జెండా పండుగ వేళయింది. ఆదివారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లుచేసింది. ఈమేరకు పరేడ్ గ్రౌండ్లు ముస్తాబు కాగా కలెక్టర్లు ఎక్కడికక్కడ జాతీయ జెండాలను ఆవిష్కరించనున్నారు. ఈ సందర్భంగా గ్రేటర్ వరంగల్ కొత్తపేటలోని పంట పొలాల్లో చిన్నారులు త్రివర్ణ పతాకాలను చేతబూని 'దేశం మనదే.. తేజం మనదే.. ఎగురుతున్న జెండా మనదే' అంటూ పరుగెడుతున్న దృశ్యాలు 'నమస్తే' కెమెరాకు చిక్కాయి.* *- వరంగల్ ఫొటోగ్రాఫర్*





సమావేశంలో మాట్లాడుతున్న దయాకర్‌రావు, పక్కన మాజీ ఎమ్మెల్యేలు దాస్యం, పెద్ది, తాటికొండ, నన్నపునేని

- ప్రజలను మరోసారి మోసం చేసేందుకు కుట్ర
- ప్రభుత్వంపై ఏడాదిలోనే వ్యతిరేకత, తిరుగుబాటు
- అందుకు నిదర్శనంగా నిలుస్తున్న గ్రామసభలు
- దావోస్ పెట్టుబడులు శుద్ధ అబద్ధం
- కాంగ్రెస్ కార్యకర్తల్లా పోలీసులు, అధికారులు
- విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి

# సీఎం రేవంత్‌వి అబద్ధపు మాటలు

హనుమకొండ, జనవరి 25 : స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మరోసారి అబద్ధపు మాటలతో ప్రజలను మోసం చేసేందుకు రేవంత్‌రెడ్డి సర్కారు కుట్రలు, కుతంత్రాలు పన్నుతున్నదని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ప్రజల్లో వ్యతిరేకత, తిరుగుబాటు వచ్చిందని, అందుకు గ్రామసభలే నిదర్శనంగా నిలుస్తాయన్నారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాయలంలో జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, పెద్ది సుదర్శన్‌రెడ్డి, నన్నపునేని నరేందర్‌తో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పథకాల అమలు పేరుతో నిర్వహించిన గ్రామసభలు దౌర్జన్య సభలుగా మారాయని విమర్శించారు. మూడు విడతల్లో లబ్ధిదారుల నుంచి తీసుకున్న దరఖాస్తులు ఏమయ్యాయని ప్రశ్నించారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు వస్తాయన్న ఆశతో ప్రజలు గ్రామసభలకు వస్తే మళ్లీ దరఖాస్తులు స్వీకరించారే తప్ప లబ్ధిదారులను ఎంపిక చేయలేదని, ఒక్కరికి కూడా న్యాయం జరగలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో కేసీఆర్ పొలం దున్నే ముందు, నారుపోసే సమయంలో రైతుబంధు వేస్తే ప్రస్తుత ప్రభుత్వం ఏడాది కాలంగా రైతుభరోసా ఇవ్వలేదన్నారు. ఇదే విషయాన్ని గ్రామసభల్లో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులను ప్రజలు నిలదీస్తే దాటవేశారన్నారు. గ్రామ సభలు అట్టర్ ఫ్లాప్ అని, అన్నింటా రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. రుణమాఫీ విషయంలో సీఎం, మంత్రుల మాటలకు పొంతన లేదన్నారు. ఇక్కడి ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేసినట్లు ఇతర రాష్ట్రాలకు పోయి సిగ్గులేకుండా చెబుతున్నారని దుయ్యబట్టారు. దావోస్ పెట్టుబడులు శుద్ధ అబద్ధమని, సీఎం స్థాయిలో ఉండి రేవంత్‌రెడ్డి నీతి లేకుండా మాట్లాడుతున్నాడని ఆరోపించారు. గత ఏడాది దావోస్‌లో ఒప్పందం చేసుకొని తెచ్చామన్న రూ.40వేల కోట్లు ఎక్కడికి పోయాయో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. పోలీసులు, అధికారులను కాంగ్రెస్ కార్యకర్తలుగా వ్యవహరిస్తున్నారని, మళ్లీ వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వ తీరుతో వరంగల్ నుంచి ఐటీ కంపెనీలు వెళ్లిపోతున్నాయని, టెక్స్‌టైల్ పార్కు విషయంలో సర్కారు సహకరించడం లేదని అధికారులే చెబుతున్నారని పేర్కొన్నారు. సమావేశంలో కార్పొరేషన్ మాజీ చైర్మన్లు నాగుర్ల వెంకటేశ్వర్లు, మర్రి యాదవరెడ్డి, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ పులి రజినీకాంత్, మైనార్టీ నాయకుడు నయీముద్దీన్, నాయకులు పోలపల్లి రామ్మూర్తి, రవీందర్‌రావు, రమేశ్ పాల్గొన్నారు.

## హామీలు నెరవేర్చాలంటే కొడతారా?



కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు అమలు చేయకుండా గ్రామ, వార్డు సభలు, దరఖాస్తులు, సర్వేల పేరిట కాలయాపన చేస్తున్నది. కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి ఒక మహిళా అధికారి అని చూడకుండా అహంకారంతో మంత్రి దూషించడాన్ని ఖండిస్తున్నా. ప్రజలు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పలేక అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చాలని అడిగితే కట్టేసి కొడతామని బెదిరింపులకు దిగుతున్నారు. రైతు బంధు, బీమా అడిగే రైతులను కొడతారా? ఇందిరమ్మ ఇళ్లు, ఇస్తానన్న రూ. 2500లు, పింఛన్ అడిగితే కొడతారా? రాబోయే స్థానిక ఎన్నికల్లో ఎవరు ఎవరిని కొడతారో చూద్దాం.

*- దాస్యం వినయ్‌భాస్కర్, బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు*

## గ్రామ సభలు అట్టర్ ఫ్లాప్



రాష్ట్రంలో జరుగుతున్న గ్రామసభలు అట్టర్ ఫ్లాప్ అయ్యాయి. ఎమ్మెల్యేలు, మంత్రులు, అధికారులకు నిరసనలు, నిలదీతలు ఎదురయ్యాయి. పోలీసుల పహారాలో సభలు నిర్వహించారు. ప్రజాప్రతినిధులు పాల్గొనడం లేదు. రాష్ట్రంలో పోలీసు పాలన నడుస్తున్నది. నర్సంపేటలో పోలీసు స్టేషన్ ఎదుట మాజీ కౌన్సిలర్‌ను కొడితే గంటల తరబడి ఎదురుచూసినా న్యాయం చేయలేదు. తిరిగి బాధితులపైనే కేసులు పెట్టారు. ఇంటెలిజెన్స్ వ్యవస్థ విఫలమైంది. వరంగల్ సీపీ అంటే గౌరవం ఉంది. ఎమ్మెల్యేలకు కల్పించిన భద్రతపై దృష్టి సారించాలి. తుపాకులతో తిరుగుతూ కొందరు భయభ్రాంతులకు గురి చేస్తున్నారు.

*- పెద్ది సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే*

## పెరిగిన రైతు ఆత్మహత్యలు



తెలంగాణలో రోజురోజుకు రైతు ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినంక 409 రైతులు ప్రాణాలు తీసుకున్నరు. ఇవన్నీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన హత్యలే. రైతు భరోసాను ఎగ్గొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి రైతుకు ఎకరాకు రూ. 17,500లు బాకీ ఉంది. అలాగే రైతు కూలీలకు రూ. 12 వేలు ఇస్తామని జాబ్‌కార్డులు, పనిదినాల పేరుతో కోతలు పెడుతున్నది. కౌలు రైతు సంగతి పూర్తిగా మర్చిపోయింది. స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఎమ్మెల్యే కడియం శ్రీహరి గ్రామసభలకు హాజరుకాకుండా క్రికెట్ పోటీల్లో పాల్గొంటున్నారు. రుణమాఫీ 40 శాతానికి మించ లేదు.

*-తాటికొండ రాజయ్య, మాజీ ఎమ్మెల్యే*

## బీఆర్‌ఎస్ హయాంలోనే అభివృద్ధి



బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే వరంగల్ అభివృద్ధి చెందింది. కాంగ్రెస్ పార్టీ కుట్రలు, కుతంత్రాలు, మోసపూరిత మాటలతో అధికారంలోకి వచ్చింది. జిల్లా మంత్రి కొండా సురేఖ గ్రామసభలకు హాజరు కాదు. ప్రజా సమస్యలను పట్టించుకోదు. గుమస్తాలను పెట్టుకొని వ్యవస్థను నడిపిస్తున్నారు. గ్రామ సభల్లో దరఖాస్తులను రూ. 500కు అమ్ముతున్నరు. ప్రజలు నిలదీస్తే పోలీసులతో కొట్టిస్తున్నరు. వరంగల్‌లో రెండు మూడు షాపింగ్ మాల్స్‌ని కూలగొట్టి సెటిల్‌మెంట్ అనంతరం పరదాలు అడ్డుకట్టి నడిపిస్తున్నరు.

*- నన్నపునేని నరేందర్, మాజీ ఎమ్మెల్యే*

# మందకృష్ణకు పద్మశ్రీ

**సామాజికోద్యమ శిఖరానికి కేంద్ర అత్యున్నత అవార్డు**

- దశాబ్దాల పోరాటానికి దక్కిన గౌరవం
- ఓరుగల్లు బిడ్డకు పురస్కారంపై సర్వత్రా హర్షం



సుబేదారి, జనవరి 25 : మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగను దేశ అత్యున్నత పురస్కారం వరించింది. దశాబ్దాల పాటు ఆయన చేసిన సామాజిక ఉద్యమాలకు అరుదైన గౌరవం దక్కింది. వివిధ రంగాల్లో సేవలు అందించిన వారికి కేంద్ర ప్రభుత్వం శనివారం అవార్డులను ప్రకటించగా తెలంగాణ నుంచి ఓరుగల్లు బిడ్డ సామాజిక ఉద్యమాల నాయకుడు మంద కృష్ణమాదిగకు పద్మశ్రీ అవార్డు దక్కింది.

## దండోరా ఉద్యమంతో..

మంద కృష్ణ మాదిగలు, మాదిగ ఉపకులాలకు విద్య, ఉద్యోగ రంగాల్లో జరుగుతున్న అన్యాయాన్ని తెలుసుకొని ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ కోసం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితిని స్థాపించారు. జూలై 7, 1994లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా ఈదుమూడి గ్రామంలో కొంత మంది యువకులతో కలిసి మాదిగ రిజర్వేషన్ పోరాటాన్ని ప్రారంభించారు. మాదిగ దండోరా ఉద్యమంతో మంద కృష్ణ అనతికాలంలో మాదిగలకు ఆత్మగౌరవ ప్రతీకగా నిలిచారు. మాదిగ దండోరా ఉద్యమాన్ని ఉమ్మడి రాష్ట్రవ్యాప్తంగా వ్యాపింపజేశారు. దండోరా ఉద్యమంతో 1997లో చంద్రబాబు ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అమలు చేసేందుకు రామచంద్రరాజు కమిషన్ ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ నివేదిక ఆధారంగా 2000 ఏప్రిల్ నుంచి 2004 నవంబర్4 వరకు ఎస్సీ వర్గీకరణ అమలు జరిగింది. దీంతో మంద కృష్ణమాదిగ మాదిగలకు బలమైన నాయకుడిగా పేరొందారు. 1994 ఎస్సీ వర్గీకరణ ఉద్యమం మొదలుకొని తెలంగాణ ఉద్యమం, అనేక సామాజిక ఉద్యమాలు చేశారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో ఆగస్టు 1న 2024న సుప్రీం కోర్టు వెల్లడించిన అనుకూల తీర్పు వరకు 30 ఏళ్లుగా మంద కృష్ణమాదిగకు ఉద్యమాల చరిత్ర ఉంది.

## మందకృష్ణ బయొడేటా

హనుమకొండ హంటర్‌రోడ్డు న్యూశాయంపేటలో మంద చిన్న కొమురమ్మ-కొమురమ్మ దంపతులకు పదో సంతానంగా 1965 జూలై 7న మంద కృష్ణ జన్మించారు. ఆయన అసలు పేరు ఏలియా. భార్య జ్యోతి, ముగ్గురు పిల్లలు కిషన్, డాక్టర్ కృష్ణవేణి, కార్తీక్.

## పీపుల్స్‌వార్ ఆర్గనైజర్ నుంచి

వామపక్ష భావజాలం, ప్రశ్నించేతత్వం ఉన్న మందకృష్ణ కొంతకాలంలో పీపుల్స్‌వార్ పార్టీలో నర్సంపేట, నెక్కొండ ఏరియా ఆర్గనైజర్‌గా పనిచేశారు. అరెస్ట్ అయిన అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో పీపుల్స్‌వార్ వ్యవస్థాపకులు సత్యమూర్తితో కలిసి కారంచేడు, చుండూరు దళిత ఊచకోతకు వ్యతిరేక ఉద్యమాల్లో పాల్గొన్నాడు. అప్పుడే మంద ఏలియా నుంచి కృష్ణమాదిగగా పేరు మార్చుకున్నారు.

## సామాజిక ఉద్యమాలు..

ఓ వైపు ఎస్సీ వర్గీకరణ ప్రధాన ఎజెండాగా ఉద్యమిస్తూనే, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలకు పింఛన్, రేషన్ బియ్యం కోటా పెంపు, గుండెజబ్బుల పిల్లలకు ఆపరేషన్, ఆరోగ్య శ్రీ పథకం అమలు వంటి అనేక సామాజిక ఉద్యమాలకు కృష్ణమాదిగ నాంది పలికారు.

## పద్మశ్రీ అవార్డుతో సంబురాలు

మంది కృష్ణమాదిగకు కేంద్ర అత్యున్నత అవార్డు పద్మశ్రీ అవార్డు దక్కడంతో మాదిగ రిజర్వేషన్ పోరాట శ్రేణులు, మాదిగలు సంబురాలు జరుపుకొన్నారు. ఉమ్మడి వరంగల్‌కు చెందిన బీసీలు సంఘాల నాయకులు, ఇతర సామాజిక వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి.

## మాదిగ జాతికి దక్కిన గౌరవం

*– గోవిందు నరేశ్ మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు*

మాదిగ రిజర్వేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగకు కేంద్ర అత్యున్నత పద్మశ్రీ అవార్డు దక్కడం యావత్ మాదిగ జాతికి దక్కిన గౌరవమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేశ్ మాదిగ సంతోషం వ్యక్తం చేశారు. ఆయన కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.



నానో ఓవెన్ బ్యాగ్ పరిశ్రమలో పారిశ్రామికవేత్త దాసరి కల్పన

*శాయంపేటకు చెందిన దాసరి కల్పనకు అరుదైన గౌరవం దక్కింది. గణతంత్ర దినోత్సవాల్లో భాగంగా ఢిల్లీలో ఆదివారం జరిగే వేడుకల్లో పాల్గొననున్నది. అలాగే ప్రధాని మోదీ సహా కేంద్ర మంత్రులతో ముఖాముఖిలో పాల్గొనే అవకాశం దక్కింది. కాగా రాష్ట్రంలో సెర్ప్ నుంచి హాజరవుతున్న ఏకైక మహిళా పారిశ్రామికవేత్త ఈమే కావడం విశేషం.* *- శాయంపేట, జనవరి 25*

ఢిల్లీ గణతంత్ర వేడుకలకు శాయంపేట మహిళా పారిశ్రామిక వేత్త

- కేంద్ర మంత్రులతోనూ ముఖాముఖికి అవకాశం
- రాష్ట్రం నుంచి ఎంపికైన ఏకైక ఎంటర్‌ప్రెన్యూర్

# ఉపాధి కల్పనకు అరుదైన గౌరవం!



హనుమకొండ జిల్లా శాయంపేట మండలకేంద్రంలోని సరస్వతి స్వయం సహాయక సంఘం నుంచి దాసరి కల్పన నేడు ఢిల్లీలో నిర్వహించే గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొననున్నది. కల్పన ఇంటర్మీడియట్ వరకు చదువుకోగా, ఈమెకు భర్త, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. 2001లో డ్వాక్రా సంఘంలో సభ్యురాలిగా కల్పన చేరి కుట్టుమిషన్ ద్వారా ఉపాధి పొందేవారు. ఈమెకు హిందీ భాషపై పట్టుండడంతో ఓరుగల్లు జిల్లా సమాఖ్య తరపున సీఆర్పీ ట్రైనింగ్‌కి ఎంపికయ్యారు. 2016లో వంద రోజుల పాటు శిక్షణ తీసుకొని ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, ఝార్ఖండ్ రాష్ట్రాలకు వెళ్లి పనిచేశారు. ఒక్కోసారి కుటుంబాన్ని వదిలి 3 నెలల పాటు ఆమె డ్యూటీ చేసేది.

**నానో ఓవెన్ బ్యాగ్స్ తయారీ పరిశ్రమ ఏర్పాటు**

డ్వాక్రా సంఘాల మహిళలను లక్షధికారులుగా చేయడమే లక్ష్యంగా సెర్ప్ లఖ్‌పతిదీదీ కార్యక్రమాన్ని ప్రారంభించగా ఈ అవకాశాన్ని కల్పన అందిపుచ్చుకున్నారు. శాయంపేట మండల సమాఖ్య తరపున రూ.15 లక్షల రుణం తీసుకొని 2020లో నానో ఓవెన్ బ్యాగ్‌ల తయారీ పరిశ్రమ ప్రారంభించారు. తను సొంతంగా మరో రూ.10 లక్షలు పెట్టుబడి పెట్టి క్రమక్రమం గా ఉత్పత్తి పెంచుకుంటూ ఏడాదికి రూ.1.20 కోట్ల టర్నోవర్ సాధించారు. తనతో పాటు ముగ్గురు మహిళలు, ముగ్గురు పురుషులకు ఉపాధి కల్పించి ఆదర్శంగా నిలిచారు.

## ఈ అవకాశం దక్కడం అదృష్టం

నేను చిన్నప్పటి నుంచి చాలా కష్టాలు పడ్డాను. కుట్టు మిషన్ పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకున్నా. నా ఇద్దరు కూతుర్లను వదిలేసి సీఆర్పీగా పనిచేయడానికి ఇతర రాష్ట్రాలకు వెళ్లాను. అక్కడ కనీసం సెల్ ఫోన్ సిగ్నల్స్ ఉండేవి కావు. నా భర్త, పిల్లలతో కూడా మాట్లాడే అవకాశం దక్కేది కాదు. ఇంతలో లక్‌పతి దీదీ కార్యక్రమం ద్వారా నాకు గొప్ప అవకాశం దక్కింది. నానో ఓవెన్ బ్యాగ్ పరిశ్రమ స్థాపించి, వచ్చే ఆదాయంతో నా ఇద్దరు కూతుర్లను ఇంజినీరింగ్ చదివిస్తున్నాను. ఈ పరిశ్రమ నడపడంలో నా భర్త సహకారం మరువలేనిది. రాష్ట్రం నుంచి ఢిల్లీకి తనకు ఒక్కరికే అవకాశం దక్కడం అదృష్టం.

*– దాసరి కల్పన, మహిళా పారిశ్రామిక వేత్త*

## పరిశోధన రంగంలో కేయూ నూతన ఒరవడి

**కే-హబ్‌లో 5 పరిశోధన కేంద్రాలు**

హనుమకొండ చౌరస్తా, జనవరి 25: పరిశోధన రంగంలో కాకతీయ విశ్వవిద్యాలయం నూతన ఒరవడికి నాంది పలికింది. కేంద్ర మానవ వనరుల విభాగం, రాష్ట్ర ప్రభుత్వం 60:40 వాటాతో 'రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షా అభియాన్ (రుసా)' 2019- 2020 సంవత్సరానికి రూ.50 కోట్ల నిధులు మంజూరు చేసింది. అందులో భాగంగా రూ.15 కోట్లతో 'ఇంక్యుబేటర్ సెంటర్ అండ్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్' కింద కే-హబ్ భవనాన్ని నిర్మించారు. 2024లో రూ.35 కోట్లు మంజూరు కాగా పూర్తికాల వీసీ లేకపోవడంతో తదుపరి కార్యాచరణ జరగలేదని ఆచార్య కే ప్రతాప్‌రెడ్డి వైస్ ఛాన్సలర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం దీనిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. ఇందులో భాగంగా రుసా మంజూరు చేసిన ఐదు పరిశోధన కేంద్రాలను ఏర్పాటుచేస్తూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పెరటి మల్లారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. వీటిలో సెంటర్ ఫర్ డ్రగ్ రీసెర్చ్, సెంటర్ ఫర్ మాలిక్యులర్ మెటీరియల్ ఫిజిక్స్, నానో డ్రగ్ డెలివరీ సిస్టమ్(నానో సైనెన్స్), సెంటర్ ఫర్ ఇథ్నో-మెడిసినల్ ప్లాంట్స్, సెంటర్ ఆన్ సైబర్ ఫిజికల్ సిస్టమ్స్ ఉన్నాయని మల్లారెడ్డి తెలిపారు.


























